
www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 21 జూన్ 2023



అసైన్‌మెంట్ కమిటీలో
పేర్ల నమోదుకు తంటాలు



తహాశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

- భూ రికార్డులు సబ్ డివిజన్ చేయడంతో జాప్యం
- రెవెన్యూ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న రైతులు

ప్రజాశక్తి- యాదమరి: ఎన్నో ఏండ్లుగా రైతులు తమ అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు పొందేందుకు ఎదురు చూస్తున్న తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం నిరుపేద రైతులకు వారి అనుభంలో ఉన్న భూములకు పట్టాలు లేనివి గుర్తించి అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పట్టాలిచ్చే కార్యక్రమం చేపడుతోంది. అయితే యాదమరి మండలంలో పట్టాలు పొందని రైతుల ఆధీనంలో ఉన్న భూములను సర్వేచేసి అధికార్లకు నివేదిక ఇవ్వాల్సిన సర్వే సిబ్బంది రీసర్వేలో రెవెన్యూ సిబ్బంది తలమునకలై ఉన్నారు. రైతుల భూముల విషయం అసలు పట్టించుకోవడం లేదు. మండలంలో అధిక సంఖ్యలో అసెండ్ భూములను రైతులు ఏండ్ల తరబడీ సాగు చేసుకుంటున్నారు. వారు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు పొందేందుకు క్షేత్రస్థాయిలో వీఆర్‌వోలు, సర్వేయర్లు అందుబాటులో లేకపోదంతో పట్టాలు పొందేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

క్షేత్రస్థాయిలో రైతుల భూములను పరిశీలిచి సర్వేచేసి భూములను సబ్‌డివిజన్ చేయాల్సి ఉంటుంది. సబ్‌డివిజన్ చేసిన తరువాత తహాశీల్దార్ అసెండ్‌మెంట్ కమిటీలో పేర్ల నమోదుకు సిఫారస్తు చేయాల్సి ఉంటుంది. గ్రామస్థాయిలో రీసర్వే జరుగుతుండటంతో వీఆర్‌వోలు, సర్వేయర్లు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అసెండ్‌మెంట్ కమిటీ భూపంపిణీ కార్యక్రమం ముందుకు సాగడం లేదు.

నా పేరు నమోదు కాలేదు..


- సుజాతమ్మ, రైతు, వేపనపల్లి



యాదమరి మండలం వేపనపల్లి గ్రామానికి చెందిన సుజాతమ్మ అనే నాకు 186 నడిమిపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 116 నందు రెండు ఎకరాల భూమి ఉంది. గత 30 సంవత్సరాలుగా ఆ భూమిలో వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్నాము. 2012 సంవత్సంలో మా భూమి రెవెన్యూ అధికారులు కొలతలు వేసి సబ్‌డివిజన్ చేసి భూసర్వే రికార్డులు అందజేశారు. అయితే మాకు పట్టాదారు పుస్తకాలు మంజూరు చేయలేదు.

మా భూములకు పట్టాలివ్వండి

- అన్నామలై, రైతు, అత్తిగారిపల్లె గ్రామం



నా పేరు అన్నామలై. మాది యాదమరి మండలం అత్తిగారిపల్లె గ్రామం బుడితిరెడ్డిపల్లి రెవెన్యూ సర్వే నెంబర్ 636లో ఒక్కటిన్నర ఎకరా భూములో సాగు చేసుకుంటున్నాము. రీసర్వీలో భూములు సర్వే చేశారు. అయితే అసెండ్‌మెంట్ కమిటీలో పేర్ల నమోదు చేసేందుకు రెవెన్యూ కార్యాలయానికి వెళ్లితే ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

మా భూములు సర్వే చేయాలి

- ఉమా, రైతు, దాసరాపల్లి



కొత్తూరు దళితవాడకు చెందిన ఉమా అనే నాకు దాసరాపల్లి 328 సర్వే నెంబర్‌లో బ్లాక్‌లో రెండు ఎకరాల భూమి ఉంది. ఈభూమిలో మామిడి, వేరుశనగ సాగు చేసుకుంటోంది. పట్టా కోసం రెవిన్యూ అధికార్లను ఆశ్రయిస్తే బ్లాక్‌లో ఉన్న భూములను సర్వే చేయమంటున్నారు.

మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం

24న అఖిలపక్షం రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కరెంటు ఛార్జీలు తగ్గించకపోయినా, ట్రూ అఫ్ చార్జీలు రద్దు చేయకపోయినా విద్యుత్ ఉద్యమం తప్పదని సిపిఎం, సిపిఐ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ట్రూ అఫ్‌చార్జీల పేరుతో వినియోగదారులపై భారాన్ని మోపడాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ మంగళవారం గాంధీ రోడ్డులోని విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై విద్యుత్ భారాన్ని మోపినందుకు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు, సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజులు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా సర్దుబాటు ఛార్జీలు, ట్రూ అఫ్ ఛార్జీలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వ మోపడం దారుణమన్నారు. అప్పుల కోసం వైసీపీ ప్రభుత్వం కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో విద్యుత్ ఛార్జీలను పెంచడం దారుణమన్నారు. ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లపై ఆదాని కంపెనీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని ఎందుకు డిమాండ్ చేయరని ప్రశ్నించారు. ప్రపంచంలో సోలార్ విద్యుత్ రేట్లు యూనిట్‌కి రూపాయి 50 పైసలు పడిపోయిందని కానీ ఆంధ్రప్రదేశ్లో విద్యుత్ ఛార్జీలు పెంచడం తగదన్నారు. విద్యుత్ ఛారాలపై సిపిఎం, సిపిఐ ఇంటింటికీ తిరిగి ప్రజలను చైతన్యపరుస్తుందన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గేంతవరకు మరో విద్యుత్‌పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రజలపై భారం వేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా 24వ తేదీన సిపిఐ, సిపిఎం పార్టీల ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం ఎస్టియు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కె.సురేంద్రన్, బాలసుబ్రమణ్యం, సిపిఐ నాయకులు మణి, దాసరి చంద్ర, విజయగౌరీ, రమాదేవి, జమ్మిలాబి, బాలాజీరావు, రఘ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

స్పందన సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలి

జెడ్‌పి సీఈవో ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: కలెక్టరేట్‌లోని స్పందన కాల్‌సెంటర్ జిల్లా పరిషత్ సీఈవో ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చే ఫిర్యాదులతో పాటు ప్రతి సోమవారం స్పందన కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుల రికార్డులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. మండల స్థాయి సమస్యలను కింది స్థాయి అధికారులకు పంపి పరిష్కరం చేసేలా చూడాలన్నారు.



స్పందన సమస్యలను రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పి సీఈవో

నవరత్నాలతో అన్నివర్గాల ప్రజలకు చేయూత

డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ఇఆర్ కండిగలో ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాలు పథకం ద్వారా అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలతో చేయూత అందిస్తున్నట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గంగాధర నెల్లూరు పంచాయతీలో గంగాధర నెల్లూరు ఎస్సీ కాలనీ, ఇఆర్.కండిగ, రెడ్డేపల్లె, నాగన్నకండిగ గ్రామాల్లో మంగళవారం డిప్యూటీ సీఎం పర్యటించి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి వద్ద పథకాలు లబ్ది పొందారా.. లేదా స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ అనిత, రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, ఉపసర్పంచ్ రామచంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ హరిబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఏకాంబరం, ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాదన్, పంచాయతీ రాజ్ డీఈ దయాకర్ రెడ్డి, ఏఈలు రాజా, శ్రీధర్, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే పౌరసేవలు

ఉచితంగా సర్టిఫికెట్లు జారీ : కమిషనర్



సమావేశంలో మాట్లాడుతున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సంక్షేమపథకాలు, పౌర సేవలను అందించడమే లక్ష్యంగా 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంపై నగర పాలక సంస్థ పరిధిలోని 50వార్డు సచివాలయాల పరిధిలోని వాలంటీర్లు, వార్డు కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నగర మేయర్ ఎస్.అముద, డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, మార్కెట్ కమిటీచైర్మన్ రాహుల్ రాజారెడ్డి, టౌన్‌బ్యాంక్ ఛైర్మన్ రాంగణేష్, వార్డు కార్పొరేటర్లు, కోఆప్షన్ నెంబర్లు, ఇతర ప్రముఖులు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ జూలై 1 నుండి ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమం కోసం నగరపాలక సంస్థపరిధిలో నాలుగు బందాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి వార్డు సచివాలయం పరిధిలో వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించి అవసరమైన మేర సమాచారం, రికార్డులు సేకరించాలన్నారు. ఈ సమాచారం ఆధారంగా ఆయా వార్డు సచివాలయాల పరిధిలో నిర్వహించే ప్రత్యేకక్యాంపు కార్యక్రమంలో వారికి అవసరమైన సర్టిఫికెట్లను ఉచితంగా చేసి ఇవ్వడం, సంక్షేమ పథకాలలో లబ్ధి కోసం 1902 ద్వారా గ్రీవెన్స్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పక్కాగా, చిత్తశుద్ధితో నిర్వహించాలని, ఇందుకోసం వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమగ్ర సమాచార సేకరణ నిమిత్తం ప్రత్యేకయాప్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. వార్డుస్థాయిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కార్యదర్శులు, వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, సహాయ కమిషనర్ గోవర్ధన్, సీఎంఎం గోపి, హౌసింగ్ ఏఈ శ్రీధర్, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సేవలను విస్తృతం చేయండి: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్, పాలసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించేందుకు తీసుకొని వచ్చినా సచివాలయ వ్యవస్థ సేవలను పెంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాలసముద్రం మండలంలో క్షేత్రస్థాయిలో విస్తతంగా పర్యటన చేసి సచివాలయాల తనిఖీ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిశీలన, జగనన్న హౌసింగ్ లేఔట్లలో గహపురోగతి, రీసర్వే తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో విస్తతంగా పర్యటించి పరిశీలించారు. పర్యటనలో భాగంగా తొలుత జిల్లా కలెక్టర్ టిఎన్‌ఆర్.పురం అంగన్వాడీ కేంద్రంలో ఆకస్మిక తనిఖీచేసి అంగన్వాడీ కేంద్రంలోని పిల్లల హాజరు, వారికి అందిస్తున్న పోషకాహారం తదితర అంశాలపై అంగన్వాడీ కార్యకర్తను ఆరా తీశారు. ఈ అంగన్వాడీ కేంద్రంలో 25 మంది పిల్లలు ఉండగా 20మంది పిల్లలు హాజరయ్యారని కార్యకర్త కలెక్టర్‌కు వివరించారు. పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. అనంతరం నరసింహపురం గ్రామ సచివాలయంను ఆకస్మిక తనిఖీ చేసి ప్రజలకు ప్రభుత్వ సేవలను సత్వరమే అందించేలా సేవలను పెంచేలా సచివాలయ సిబ్బంది పని చేయాలన్నారు. తిరుమల రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు - నేడులో భాగంగా జరుగుతున్న 10 కాంపోనెంట్లు పనులు పూర్తి కాకపోవడంపై విద్యాశాఖ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని, పనుల వలన విద్యార్థులకు అసౌకర్యం కల్పించరాదని ప్రధానోపాధ్యాయులు ఆదేశించారు. పాలసముద్రం హౌసింగ్ లేఔట్‌ను పరిశీలించగా మొత్తం 45ఇండ్లు మంజూరు కాగా 13ఇండ్లు పూర్తి కావడం జరిగిందని మిగిలిన ఇండ్లు పురోగతిలో కలవని హౌసింగ్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంను పరిశీలించిన కలెక్టర్ వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. దీనితో పాటు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈపర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్, తహిశీల్దారు బాబు, హౌసింగ్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



పాలసముద్రం పిహెచ్‌సిని పరిశీలిస్తున కలెక్టర్

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

ఎస్ఆర్.పురం: మండలంలో జరుగుతున్న గహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులు ఆదేశించారు. మంగళవారం మండలంలోని పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు- నేడు పనులు పరిశీలించారు. నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని, సకాలంలో పనులు పూర్తిచేసే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. అనంతరం సచివాలయం అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసి రీసర్వేలను వేగవంతం చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం సకాలంలో అందించాలన్నారు. విధులకు సక్రమంగా రాని ఎంఎల్‌ఓ చర్య తీసుకోవాలని అవసరమైతే విధుల నుంచి తొలగించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం 50 బసిరెడ్డిపల్లి జగనన్న కాలనీ సందర్శించి గహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని నిర్మాణ పనులు మొదలుపెట్టిన లబ్ధిదారులకు నోటీసులు అందించి, నిర్మాణం చేపట్టని వారి గహాలను రద్దు చేయాలన్నారు. ఆరిమకులపల్లి పిహెచ్‌సి కేంద్రాన్ని సందర్శించి హాస్పిటల్ ఆవరణ చుట్టు అప్రశుభ్రంగా ఉన్నాయని, పరిసర ప్రాంతాల్లో శుభ్రంగా ఉంచుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేయాలని మండల అధికారులను ఆదేశించారు. తహశీల్దార్ లోకనాథ పిల్లై, ఎంపీడీవో కష్ణయ్య, హౌసింగ్ డిజె వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

గంగాధరనెల్లూరు: మండలంలోని తూగుండ్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ సగలి షన్మోహన్ మంగళవారం తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని పలు గదులను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణంను శుభ్రం చేయించాలని డాక్టర్‌ను ఆదేశించారు. రామనాడపల్లి జగనన్న లేఔట్‌ని, అగర మంగళం సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఎంపీడీవో శ్రీదేవి, తహశీల్దార్ ఇన్బనాథన్, తూగుండ్రం పిహెచ్‌సి డాక్టర్ దివ్య, ఎంఈఓ రాజేంద్రన్, హౌసింగ్ వర్క్ఇన్స్పెక్టర్ గీత పాల్గొన్నారు.



ఎస్ఆర్‌పురంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్

పూతలపట్టు ఎస్ఐ సహా ఆరుగురు పోలీసుల పై కేసు

నలుగురు మహిళలపై పోలీసుల లైంగిక వేధింపుల ఆరోపణ

తమిళనాడులో చికిత్స పొందుతున్న బాధితులు



ప్రజాశక్తి- పూతలపట్టు: పూతలపట్టు పోలీసులు పోలీసు వ్యవస్థకే మచ్చ తెచ్చారు. మహిళలకు రక్షణగా నిలువాల్చిన పోలీసులే లైగికంగా వేధించి, కాటు వేశారని బాధిత మహిళలు ఆరోపించారు. ఈ విషయమై జరిగిన ప్రాథమిక విచారణలో లైంగిక వేధింపులు నిజమని తేలడంతో పూతలపట్లు ఎస్ఐ సహా ఆరుగరు పోలీసుల మీద చిత్తూరు పోలీసులు కేసును నమోదు చేశారు. ఈ అవమానవీయ సంఘటనకు సంబంధించి పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్, కానిస్టేబుల్ తనికాచలంతో పాటు మరో నలుగురిపై చిత్తూరు టూటౌన్ పోలిస్ స్టేషన్‌లో లైంగిక కేసు నమోదు అయ్యింది. వివరాల్లోకి వెళ్తే గత కొన్నిరోజుల క్రితం కల్లూరు వద్ద భారీ చోరీ జరిగింది. ఈ కేసుపై దర్యాప్తు ప్రారంభించిన పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్ తన బృందంతో కలిసి తమిళనాడు వెళ్లి నిందితులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈకేసులో పూమది, అయ్యప్పతో సహా ఆరుగురిని అరెస్టు చేశారు. అయితే ముఠాలో నలుగురు నిందితులు మహిళలే. విచారణ అనంతరం పోలీసులు ఇద్దరిని రిమాండ్‌కు పంపి మరో నలుగురికి నోటీసులిచ్చి పంపించారు. ఈ ముఠాలో నలుగురు మహిళల్ని ఏపీ పోలీసులు లైంగికంగా వేధించి హింసించారని తమిళనాడులోని క్రిష్ణగిరి పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంచో చిత్తూరు ఎస్పీ రిశాంత్ రెడ్డితో కృష్ణగిరి పోలీసులు మాట్లాడారు. అనంతరం ఎస్పీ ఈ వ్యవహారంపై దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం కృష్ణగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల నుంచి ప్రాథమిక నివేదిక ఇవ్వాలని నగరి అర్బన్ సీఐ వాసంతికి ఆదేశించారు. ఈ మేరకు జిల్లా ఎస్పి ఆదేశాల మేరకు పూతలపట్టు ఎస్సై హరిప్రసాద్, కానిస్టేబుల్ తనికాచలంతో పాటు మరో నలుగురిపై చిత్తూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్‌లో లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. ఈ కేసుపై చిత్తూరు డిఎస్పి శ్రీనివాసరావును విచారణ అధికారిగా నియమిస్తూ, పలు సెక్షన్ల కింద టూటౌన్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు.

అదరగొట్టిన క్యాంఫర్డ్ విద్యార్థులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం స్థానిక సంసిద్ క్యాంపర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు మెసానికిల్ క్రీడామైదానంలో యోగా ఆసనాలతో అదగొట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా యోగా శిక్షకులు జయప్రకాష్, శివప్రసాద్‌లు పాల్గొన్నారు. యోగా ఉపాధ్యాయులు మురళి విద్యార్థులచే యోగా ఆసనాలు వేయిచారు. చిత్తూరు నగరంలోని మూడు సంసిద్ క్యాంపర్డ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు చెందిన 1000 మందికి పైగా విద్యార్థులు పాల్గొని యోగా ఆసనాలతో అలరించారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

'ఆశీర్వదించి గెలిపించండి'

గాలి భాను ప్రకాష్



ప్రజాశక్తి- నగరి నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ జన్మదిన వేడుకలు మంగళవారం నగరి పట్టణంలో అట్టహాసంగా నిర్వహించారు. నగరికి విచ్చేసిన ఆయన తొలుత ఓంశక్తి ఆలయానికి చేరుకోగా ఆయన పేరిట ఆలయ పూజారులు అర్చనలు చేసి ఆయనకు ప్రసాదాలు అందజేశారు. బాలాజీ గోల్డెన్ సిటీ సమీపంలో పార్టీనాయకులు ఏర్పాటుచేసిన పుట్టినరోజు నిర్వహణవేదికకు చేరుకున్నారు. అక్కడ ఆయనకు క్రేన్ ద్వారా భారీ ఆరంజిపండ్ల మాలను వేయడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ వేడుకల్లో ఆయనతో పాటు ఆయన కుమారులు కష్ణ, రామ్ హాజరయ్యారు. ఈసందర్భంగా గాలి భానుప్రకాష్ మాట్లాడుతూ తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. తనకు సహాయ సహకారాలు అందించే ప్రతి ఒక కార్యకర్తను, నాయకుని గుర్తుపెట్టుకుంటానని అన్నారు. ఇచ్చిన మాటను తప్పనని రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు సీఎం అవడం తథ్యమన్నారు. అలాగే నగరిలో తెలుగుదేశం విజయం సాధించడం ఖాయం అంటూ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాన్ని మరో ముద్దుకష్ణమ నాయుడు లాగా అభివృద్ధి చేసి చూపిస్తా అంటూ హామీ ఇచ్చారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర అభివద్ధి జరుగుతుందని నగిరి నియోజవర్గానికి మంచి రోజులు రాబోతున్నాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న మట్టి దోపిడీ ఇసుక దోపిడీ, భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలు అరికడతామని నియోజకవర్గంలో జరిగిన ప్రతి అభివద్ధి తెలుగుదేశం పాలనలో గాలి ముద్దుకష్ణమ నాయుడు హయాంలో చేసిందే అన్నారు. టిడిపి ఎప్పుడు కూడా భవనాలకు రంగులేసి ప్రారంభించలేదని, శంకుస్థాపనలు చేసి మరిచిపోలేదని అన్నారు. రాష్ట్ర టిడిపి లీగల్‌సెల్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు రావూరి పురుషోత్తం, బాలసురేష్, టిఎన్‌టియుసి రాష్ట్ర అధికార ప్రతినిధి బాలాజి, మరి రూరల్ మండలం అధ్యక్షుడు జె.శివకుమార్ రెడ్డి, నగరి రూరల్ మండలం జనరల్ సెక్రటరీ కె.పురుషోత్తం, పరంధామ నాయుడు, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షులు పి.వెంకటేశ్ చిట్టి, టౌన్ ఐటీడీపీ కోఆర్డినేటర్ వెంకి, రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజర్ ఖాదర్‌బాయ్, వైస్ ప్రెసిడెంట్ టి.అన్సారీ పాల్గొన్నారు.

పానగల్ గంగమ్మకు ముక్కంటి సారె



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్‌లో వెలసిన గంగమ్మకు జాతర పురస్కరించుకుని మంగళవారం శ్రీకాళహస్తీశ్వర ఆలయ ఆధ్వర్యంలో సారె సమర్పించారు. పొన్నాలమ్మ ఆలయం నుంచి మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య సారె తీసుకెళ్లారు. ఈ సారెను పానగల్ గంగమ్మ జాతర కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమారుడు ఆకర్ష రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి జన్మదిన వేడుకలు మంగళవారం వెంకటగిరి నియోజకవర్గం రాపూరు మండలంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరంలో టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షురాలు చక్రాల ఉష ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కేక్ కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. నారా భువనేశ్వరి ఇలాంటి జన్మదినం వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా చక్రాల ఉష మాట్లాడుతూ నారా భువనేశ్వరి కేవలం రాజకీయ కుటుంబస్తురాలే కాదనీ, సామాజిక సంఘసంస్కర్త అన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా వేలాదిమందికి అండగా ఉంటున్నారని చెప్పారు. భువనేశ్వరి అందరికీ ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ అధ్యక్షురాలు కౌసల్యమ్మ, పట్టణ అధ్యక్షురాలు మాధవి, ప్రసన్న, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోలా ఆనంద్ ...



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బీజేపీ రాష్ట్ర అధికార మీడియా ప్రతినిధి కోలా ఆనంద్ జన్మదిన వేడుకలు మంగళవారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. కోలా ఆనంద్ అభిమానులు కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలియచేశారు. ఇక పట్టణ ప్రముఖులు పలువురు కోలా ఆనంద్ కు శుభాకాంక్షలు తెలియచేశారు. కోలా ఆనంద్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపు కోవాలని వారు కోరుకున్నారు. కాగా కోలా ఆనంద్ జన్మదినం పురస్కరించుకుని అభిమానులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కో -కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కోట ఎంఈవో-2గా మస్తానయ్య



ప్రజాశక్తి-కోట : కోట మండల ఎంఈవో-2గా మస్తానయ్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అన్ని పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థులపై స్నేహ పూర్వకంగా ఉండి రానున్న రోజుల్లో మంచి ఫలితాలు సాధించేలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

నారా లోకేష్‌తో శ్రీధర్‌రెడ్డి




ప్రజాశక్తి-కోట: వెంకటగిరి నియోజకవర్గంలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ నాయకులు మాజీ మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో కోట మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు మారం రెడ్డి. శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. కోట మండల పరిధిలో టిడిపి పార్టీకి చెందిన పలు విశేషాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

కాంట్రాక్టు అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి



ప్రజాశక్తి-పాకాల: మండలంలోని కాంట్రాక్టు అధ్యాపకులను జె.ఎ.సి కార్యాచరణలో భాగంగా 2014 జూన్ రెండు నాటికి జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు అందరినీ రెగ్యులర్ చేయాలని పాకాల బస్టాండ్ కూడలిలోని దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలు, చలమారెడ్డి, చంద్ర, విజయలక్ష్మి, బేబీ తదితరులు పాల్గొన్నారు.

జేఏసీ ఛైర్మన్‌కు సన్మానం



ప్రజాశక్తి-దొరవారిసత్రం: అమరావతి జేఏసీ ఛైర్మన్, దొరవారిసత్రం తహశీల్దారు గోపిరెడ్డిని సూళ్లూరుపేట ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యాలయంలో శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు శీనయ్య, సెక్రటరీ జయరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, జిల్లా నాయకులు బీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు ఆదర్శం.. అమరనాథ్‌రెడ్డి



ప్రజాశక్తి-పలమనేరు : తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా రాయలసీమ ప్రాంతంలో జరిగిన యువగళం పాదయాత్రలో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పాత్ర భేష్ అని పలమనేరు టిడిపి నాయకులు కొనియాడారు. రాయలసీమ ప్రాంతంలో యువగళం దిగ్విజయంగా పూర్తి అయిన సందర్భంగా పలమనేరు పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డిని మంగళవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన్ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. జనవరి 27 నుంచి నిర్విరామంగా 130 రోజుల పాటు సాగిన ఈ యాత్రలో లోకేష్ బాబు వెంట నడుస్తూ అన్ని జిల్లాల్లో కార్యక్రమం విజయవంతం కావడానికి ఆయన కషి చేసారన్నారు. ఓ వైపు ప్రతి నియోజకవర్గంలో పార్టీ నేతలను సమన్వయపరుస్తూ మరోవైపు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ చరిత్ర లో నిలిచిపోయేలా యువగళాన్ని విజయవంతం చేయించారని కొనియాడారు. నారా లోకేష్ బాబు సైతం రాయలసీమ ప్రాంతం పూర్తి అయిన సందర్భంగా అమరనాథ రెడ్డిని ఆలింగనం చేసుకొని భావోద్వేగానికి గురికావడమే ఇందుకు నిదర్శనమన్నారు. అప్పగించిన పనిని నిబద్ధతతో.. అంకితభావంతో పనిచేయడంలో నేటి యువతకు అమరనాథ రెడ్డి ఆదర్శం అన్నారు. అలాంటి నేత నాయకత్వంలో తామంతా పనిచేస్తుండడం తమ అదష్టమన్నారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, చాంద్ బాషా, ఖాజా పీర్, నాగరాజు, మాబాషా,శ్రీనివాసులు, మండల నాయకులు జగదీష్ నాయుడు, సెల్వరాజ్, రామూర్తి నాయుడు, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తారకనాథ్ వర్ధంతి వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు కామ్రేడ్ తారక్ నాథ్ 19వ వర్ధంతి వేడుకలు మంగళవారం శ్రీకాళహస్తిలో ఘనంగా నిర్వహించారు. తారకనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా . శ్రీ కాళహస్తి బ్రాంచ్ యూనియన్ సెక్రటరీ మునెయ్య మాట్లాడుతూ కామ్రేడ్ తారకనాథ్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ సర్కిల్ ఫెడరేషన్ జనరల్ సెక్రెటరీ, ఎన్‌సీబీఈ జనరల్ సెక్రెటరీ హోదాలో యూనియన్ కు, సభ్యులకు ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడని కొనియాడారు. మధ్యాహ్నం బ్యాంకు ఆవరణలో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా చీఫ్ మేనేజర్ స్వప్నప్రియ, ఆర్ఏసీసీ చీఫ్ మేనేజర్ , స్టేట్ బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సురేష్, ప్రియా, భార్గవి, పూజ, రామరాజు, శివకుమార్, బాలకష్ణారెడ్డి, చంద్రారెడ్డి, లావణ్య, గోపీనాథ్, సాయి, పద్మావతి, రఫీ ,ఫిరోజ్ ,కష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో సేవలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రజలకు అందుబాటులో సేవలు ఉండేలా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని.. కార్యక్రమంపై ప్రత్యేక దష్టి సారించాలని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కేఎల్ఎంఎన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘం వైఎస్ఆర్ భవనంలో జగనన్న సురక్షపై కార్యదర్శులు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో టీపీవో మూర్తి, ఆర్వో ఇన్‌ఛార్జి మేనజర్ ఆర్.పెంచలయ్య, ఏఈ యస్.కార్తికేయ, టి.పి.యస్. వంశీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



ప్రజాశక్తి-బాలాయపల్లి: వెంకటగిరి-గూడూరు రోడ్డు మార్గం బాలాయపల్లి మండలం నిండలి గ్రామ సమీపం వద్ద రోడ్డు భవనాలశాఖ క్వాలిటీ కంట్రోల్ అధికారులు మంగళవారం పరిశీలించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారి సీఈ పీసీ రమేష్ మాట్లాడుతూ వెంకటగిరి పట్టణం సమీపం వద్ద ఉన్న ఎన్‌హెచ్ 5 నుంచి తిప్పారుపాడు వరకు రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. ఆ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే వేటు తప్పదని.. బిల్లులు చేయమని హెచ్చరించారు. సుమారు రూ.40 కోట్లతో రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రోడ్లు భవనాల శాఖ ఎస్ఈ శివకుమార్, ఎస్ఈ గంగాధరం, ఈఈ రామాంజనేయులు, ఈఈ గీతాంజలి, డీఈ మధుసూదన్, ఏఈ వాసు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల లబ్ధికి ఆధార్ తప్పనిసరి



ప్రజాశక్తి-పెద్దపంజాణి: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలుపరిచే సంక్షేమ పథకాలకు ఆధార్ గుర్తింపు కార్డు తప్పనిసరి అని ఎంపిపి యన్.రెడ్డప్ప అన్నారు. మంగళవారం చలమంగళం పంచాయతీ పరిధిలోని చిన్నేపల్లి గ్రామంలో అంగన్వాడీ సిబ్బందికి, బాలింతలకు ఆణవర్ నమోదుపై ఏర్పాటు చేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో ఎంపిపి యన్.రెడప్ప, పాల్గొన్నారు. అంగన్వాడీ సూపర్వైజర్లు రాధ, సుజాత, పంజాని సత్రం అంగన్వాడి వర్కర్ పద్మావతమ్మ యశోద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సురేష్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం గుడుపల్లి మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి సురేష్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు కార్యకర్తలు ఆయనకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మండల పార్టీ అధ్యక్షులు బాబునాయుడు, మాజీ జెడ్పిటిసి బేటప్ప నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ హేమంబర గౌడు, మహిళలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాశక్తి-పులిచెర్ల : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ వైద్యాధికారిని కుముదవల్లి తెలిపారు. కల్లూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ యోగా దినోత్సవంపై ముందస్తు అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. యోగా దినోత్సవంపై వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కుముదవల్లి మాట్లాడుతూ నేటి సమాజంలో పెరుగుతున్న రోగాలను అరిక ట్టేందుకు యోగాసనాలు మనిషి జీవన శైలిలో ఎంతో ఉపయోగపడుతాయన్నారు. వయస్సుతో తేడా లేకుండా ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు యోగా చేయాలన్నారు.

నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ఎంతో ఖర్చు చేస్తున్నదని.. విద్యార్థి దశ నుండి విద్యనభ్యసించి ఎదగాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ..అందుకోసం ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, మధ్యాహ్నం రుచికర భోజనము అందిస్తున్నారన్నారు. పిల్లలను ప్రభుత్వ బడిలో చేరే విధంగా పాఠశాలలను నాడు నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలలుగా తయారు చేశారని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 రమేష్ బాబు ప్రధానోపాధ్యాయ ధనంజయరాజు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ అరికట్టాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీలు అరికట్టాలని.. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పుత్తూరు డివిజన్ డీవైఈవో రఘురామయ్యను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, పుత్తూరు పట్టణ అధ్యక్షులు దిలీప్ మాట్లాడుతూ పుత్తూరు మండల పరిధిలోని కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని.. అద్దె భవనాలకు బిల్డింగ్ ఫీజులు వసూలు చేస్తున్నారని, బుక్స్, యూనిఫాం, బెల్టు, షూలు, పెన్సిల్, పెన్నులు సైతం తమ పాఠశాలలోనే కొనాలని విద్యార్థుల తల్లిదండ్రులకు ఆంక్షలు పెడుతున్నారని తెలిపారు. స్కూలు బస్సులు సైతం కాలం చెల్లినవే ఉన్నాయన్నారు. డీవైఈవో రఘురామయ్య మాట్లాడుతూ విచారించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అయ్యప్ప, సురేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

తులసిరామిరెడ్డికి పితృవియోగం



ఎస్ఆర్ పురం / వెదురుకుప్పం : వెదురుకుప్పం మండలానికి చెందిన టిటీడీ ఉద్యోగ సంఘ కార్యదర్శిగా. తులసి రామిరెడ్డి ఉన్నారు. ఈయన ప్రస్తుతం తిరుపతి జిల్లా కార్యదర్శి. .వారి తండ్రి అయిన జయరాంరెడ్డి అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిటిడి ఉద్యోగ సంఘ నాయకులు సభ్యులు సొంత గ్రామమైన వెదురుకుప్ప ం మండలం తోటానపల్లి గ్రామంలో ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా రీజినల్ అధ్యక్షులు జి వి ముని , పిటిడి వైయస్సార్ ఏడిసి పరమేశ్వర్, సత్య ప్రకాష్ , కెపి రెడ్డి , టీ ఎస్ మన్యం, పరంధామయ్య , నరసింహులు, అల్లయ్య, తిరుమల డిపో జాయింట్ సెక్రెటరీ గోవిందయ్య ,ఎస్ఆర్ పురం భాస్కర్ నాయుడు , కొత్తపల్లి మాజీ సర్పంచ్ విజయబాబు పలువురు నాయకులు ఓదార్చిన వారిలో ఉన్నారు..

ఎంఈవోగా నూతన బాధ్యతలు



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలానికి నూతన విద్యాశాఖ అధికారిగా ఎంఈవో-2 గా మంగళవారం ఎం.దామోధరం బాధ్యతలు తీసుకున్నారు. వెదురు కుప్పం మండలంలో విద్యాశాఖ అధికారిగా పనిచేసిన కె. శంకరయ్య తిరుపతి రూరల్ (ఎంఈఓ-2) విద్యాశాఖ అధికారిగా బదిలీ అయ్యారు. శంకరయ్య కి యుటిఎఫ్ తరపున మండలంలో ఉపాధ్యాయులు సన్మానించి వీడ్కోలు పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): రాజంపేట రేంజ్ ఎస్ఆర్ పాళ్యం సెక్షన్ లోని అటవీ ప్రాంతంలో 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ స్మగ్లర్ ను మంగళవారం టాస్క్ ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్ ఫోర్సు డీఎస్పీలు మురళీధర్, చెంచుబాబు అధ్వర్యంలో ఆర్ఐ (రిజర్వుడు) సురేష్ కుమార్ రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బందం సానిపాయ జంక్షన్ నుంచి సోమవారం కూంబింగ్ చేపట్టారు. రాజంపేట రేంజ్ ఎస్ఆర్ పాళ్యం సెక్షన్‌లోని రోళ్ల మడుగు వద్ద కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించగా వారిని అడ్డగించే ప్రయత్నం చేశారు. వారు దుంగలు పడేసి పారిపోతుండగా ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా సిత్తేరి పంచాయతీకి చెందిన శివకుమార్ చిన్నరామన్ గా గుర్తించామని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు. 261 కిలోల బరువున్న 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి సీఐ బాలకష్ణ దర్యాప్తు చేస్తున్నారు.

కాలేయం చికిత్సకు ఆర్థిక సహాయం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తిరుమలలో నివాసం ఉంటున్న నవీన్, హరితల 7 నెలల బాబు కాలేయం సమస్యతో హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. బాబుకు చికిత్సకు రూ.18 లక్షలు అవసరం కావడంతో ఆర్థిక సాయం కోసం రక్షత ఫౌండేషన్ వారిని సంప్రదించగా దాతల నుంచి విరాళాలు సేకరించి రూ.75 వేలు ఫౌండేషన్ కార్యదర్శి షణ్ముఖ శ్రీనివాస్, కోశాధికారి వంశీ హైదరాబాద్‌కి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రస్తుతం బాబు కాలేయం చికిత్స సమస్య లేకుండా పూర్తి అయినట్లు కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు జగదీశ్వర రాజు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సుదేవ్, కార్తీక్, మదన్, అవినాష్ , శంకర్, జగధాభి నవీన్, గోపి, ప్రశాంత్, జాన్సన్, రాజా కిశోర్, నవీన్ కుమార్, ధనుష్, కిరణ్, గౌతం, యోగి, పార్థసారథి, ధీరజ్ , శివ, నారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



ప్రజాశక్తి-దొరవారిసత్రం: దొరవారిసత్రం మండల పరిధిలోని కలగుంట గ్రామం వద్ద రేషన్ బియ్యం తరలిస్తున్న మూడు వాహనాలను సీజ్ చేసినట్లు సివిల్ సప్లై తహశీల్దారు ఓబులయ్య తెలిపారు. మూడు వాహనాలను పరిశీలించగా 328 బస్తాలు ఉన్నట్లు గుర్తించారు. సుమారు వీటి విలువ రూ.5,90,400 ఉంటుందని తెలిపారు. మూడు వాహనాల డ్రైవర్లను, వాహనాలను స్థానిక పోలీస్ స్టేషన్లో అప్పగించారు. దాడుల్లో స్థానిక ఎస్సై తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఈవోను కలిసిన యూటీఎఫ్ నాయకులు



ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట ఎంఈవో-2గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బి.మునిరత్నంను నాయుడుపేట మండల శాఖ యూటీఎఫ్ నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శాలువాలు, పూలమాలతో సన్మానించారు.

పాటిమిట్ట గిరిజనుల వినతి

ప్రజాశక్తి-చిట్టమూరు: తమ పొలాలకు సాగునీరు అందేలా సాయం చేయాలని పాటిమిట్ట గిరిజన రైతులు మంగళవారం తహశీల్దార్ విజయలక్ష్మికి విన్నవించారు. తెలుగుగంగా సాగునీరు అందుబాటులో ఉన్నా సాగు నీరు పారడం లేదని.. ఇంజన్లు పెట్టి సాగునీరు తోలుకుంటున్నామని వాపోయారు. మెట్టభూమిలో ఒక్క అడుగు మేర మట్టి తొలగించుకుంటే సాగునీరు అందుబాటులోకి వస్తుందని రైతులు కోరారు. మట్టి తొలగించుకునేందుకు అనుమతులు మంజూరు చేసి న్యాయం చేయాలని వినతిపత్రం అందించారు.